క్లుప్తంగా

చదువుతో పాటు క్రీడలు అవసరం



బహుమతి ప్రదానం చేస్తున్న వైస్ ప్రిన్సిపాల్

రామగిరి: విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు అవసరమని మంథని జేఎన్టీయూ వైస్ ప్రిన్సిపాల్ ఎం.ఉదయ్‌కుమార్ అన్నారు. మై భారత్ ఆధ్వర్యంలో జాతీయ క్రీడా దినోత్సవం పురస్కరించుకొని వాలీబాల్ లీగ్ పోటీలను బుధవారం కళాశాలలోని మోక్షగుండం విశ్వేశ్వరయ్య క్రీడా ప్రాంగణంలో నిర్వహించారు. మై భారత్ పెద్దపల్లి జిల్లా వలంటీర్ మహేశ్ అధ్యక్షతన జరిగిన బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమానికి వైస్ ప్రిన్సిపాల్ హాజరయ్యారు. ప్రథమ బహుమతిని నాలుగో సంవత్సరం, ద్వితీయ బహుమతిని రెండో సంవత్సరం విద్యార్థులకు అందించారు. పరిపాలనాధికారి సుమన్‌రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్లు పింగిళి కృష్ణారెడ్డి, సునీల్‌కుమార్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వనమహోత్సవం పనుల పరిశీలన

జూలపల్లి: మండలంలోని గ్రామాల్లో వనమహోత్సవం పనులను బుధవారం డివిజనల్ పంచాయతీ అధికారి వేణుగోపాల్ పరిశీలించారు. పెద్దాపూర్, కుమ్మరికుంట గ్రామాల్లో ఉపాధిహామీ పథకంలో వనమహోత్సవ పథకంలో నాటిన మొక్కలను కాపాడాలని ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు. ఏపీవో సదానందం, తదితరులు ఉన్నారు.

ఫౌండేషన్‌కు విద్యార్థుల విరాళం

జూలపల్లి: మండల కేంద్రంలోని న్యూబ్రిలియంట్ విద్యాలయం విద్యార్థులు విరాళాలు సేకరించి హైదరాబాద్ కేంద్రంగా పని చేస్తున్న సోచ్ ఫౌండేషన్‌కు రూ.19వేలు అందజేశారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో నడుస్తున్న అంధుల పాఠశాల భవన నిర్మాణానికి వినియోగించాలని విద్యార్థులు కోరారు. పాఠశాల కరస్పాండెంటు సత్యం ఉన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వానికి రుణపడి ఉంటాం

రామగిరి: భవన నిర్మాణ కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ద్వారా అందించే ఇన్సూరెన్స్ పెంచిన కాంగ్రెస్ ప్రభుత్వానికి రుణపడి ఉంటామని భవన నిర్మాణ కార్మిక సమైక్య సంఘం జిల్లా అధ్యక్షుడు చిలువేరు స్వామి అన్నారు. మండలంలోని కల్వచర్ల మండల భవన నిర్మాణ కార్మిక సంఘం కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రమాదంలో చనిపోయిన కార్మికులకు త్వరగా ఇన్సూరెన్స్ సొమ్ము అందేలా జాప్యం జరగకుండా ప్రభుత్వం చొరవ తీసుకోవాలని కోరారు. నాయకులు ఎస్.కె.షరీఫ్, బైరి శంకర్, కుసుమ సురేశ్, వెంగళ రాములు, కార్మికులు సంతోష్, సారయ్య, రోశయ్య, విష్ణువర్ధన్, సంతోష్ పాల్గొన్నారు.

యూరియా పంపిణీలో కాంగ్రెస్ విఫలం



వినతిపత్రం అందిస్తున్న బీజేపీ నాయకులు

పెద్దపల్లిరూరల్: రైతాంగానికి అవసరమైన యూరియాను కేంద్ర ప్రభుత్వం రాయితీపై సరఫరా చేసినా పంపిణీ చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని బీజేపీ నాయకులు పల్లె సదానందం, పర్శ సమ్మయ్య, బెజ్జంకి దిలీప్ అన్నారు. యూరియా కొరతను తీర్చాలంటూ బుధవారం కలెక్టరేట్‌లో ఏవో శ్రీనివాస్‌ను కలిసి వినతిపత్రం అందించారు. కేంద్రం యూరియాను రాష్ట్రానికి కేటాయిస్తే ఇక్కడి వ్యాపారులు నిల్వలను దాచుకుని, అవసరమైన రైతులకు అనవసర మందులు అంటగట్టి, అవి కొంటేనే యూరియా ఇస్తామంటున్నారని ఆరోపించారు. అధికారులు వ్యాపారులపై చర్యలు తీసుకుని రైతులకు అవసరమైన యూరియా అందేలా చూడాలని డిమాండ్ చేశారు. నాయకులు పెండ్యాల కుమార్, బండ కరుణాకర్, సందీప్ ఉన్నారు.

నానో యూరియా వాడాలి

పాలకుర్తి: రైతులు ద్రవరూపంలో ఉన్న నానో యూరియా వాడితే తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి బండి ప్రమోద్‌కుమార్ పేర్కొన్నారు. మండల పరిధిలోని రైతులకు బుధవారం నానో యూరియా గురించి అవగాహన కల్పించారు. నానో యూరియా అరలీటర్ బాటిల్ ధర రూ.225 ఉండగా కలెక్టర్ కోయ శ్రీహర్ష కంపెనీ ప్రతినిధులతో మాట్లాడి ప్రస్తుతం జిల్లా రైతులకు రూ.150కే అందించేలా చర్యలు చేపట్టారని తెలిపారు. అనంతరం కన్నాల సింగిల్‌విండో ద్వారా కన్నాల, రాణాపూర్ గ్రామాల రైతులకు యూరియా బస్తాలు పంపిణీ చేశారు. కన్నాల సింగిల్‌విండో చైర్మన్ బయ్యపు మనోహర్‌రెడ్డి, ఏఈవో శశిధర్, రైతులు పాల్గొన్నారు.

నరసింహాపురం.. సమస్యలతో సతమతం

- గుంతల రోడ్లు.. రోడ్డుకి ఇరువైపులా చెట్లపొదలు
- పాఠశాలలో వననర్సరీ ఏర్పాటుతో గదుల్లోకి వస్తున్న పాములు
- భయాందోళనలో విద్యార్థుల తల్లిదండ్రులు



పాఠశాల ఎదుట ఉన్న నర్సరీ



కాలనీలో రహదారులకు ఇరువైపులా పెరిగిన చెట్లపొదలు

కమాన్‌పూర్: మండలంలోని పేంచికల్‌పేట గ్రామ శివారులోని సింగరేణి భూనిర్వాసితుల కోసం ఏర్పాటు చేసిన నరసింహాపురం కాలనీవాసులు అనేక సమస్యలతో నిత్యం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సింగరేణి ప్రభావిత గ్రామం వెంకట్రావ్‌పల్లె నిర్వాసితుల కోసం 1994లో పేంచికల్‌పేట శివారులో సుమారు 600 ప్లాట్లు కేటాయించారు.

గుంతల రోడ్లు.. చెట్లపొదలు

నరసింహాపురం కాలనీలో గతంలో ఏర్పాటు చేసిన సీసీరోడ్లు పూర్తిగా గుంతలు పడడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. రహదారులకు ఇరువైపులా చెట్లపొదలు పెరిగాయి. చెట్లపొదల నుంచి పాములు, క్రిమికీటకాలు ఇళ్లు, పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాల్లోకి వస్తున్నాయని కాలనీవాసులు, టీచర్లు భయపడుతున్నారు. కాగా రోడ్లకు ఇరువైపులా డ్రైనేజీలు ఏర్పాటు చేయలేదు. సింగరేణి సంస్థ కాలనీలో డ్రైనేజీలు ఏర్పాటు చేసి తెలుగుతల్లి చౌరస్తా నుంచి గోదావరిఖని-కమాన్‌పూర్ వెళ్లే ప్రధాన రహదారి రైల్వే గేట్ వరకు రహదారి విస్తరించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

ఆందోళనలో విద్యార్థుల తల్లిదండ్రులు

నరసింహాపురం కాలనీ ప్రభుత్వ పాఠశాల ఆవరణలో వననర్సరీ ఏర్పాటు చేశారు. దీంతో విద్యార్థులు, చిన్నపిల్లలు భయాందోళనకు గురవుతున్నారు. ఇటీవల ఓ పెద్దపాము పాఠశాల గదిలోకి రాగా స్థానికులు చంపేశారు. ఇలా నిత్యం పాములతో సావాసం చేయాల్సి వస్తోందని పాఠశాల సిబ్బంది, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలలో వన నర్సరీ ఏర్పాటు చేయడంతోనే ఈ పరిస్థితి నెలకొందని వారు వాపోతున్నారు. పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదన్నారు. తమ సమస్యలన్నీ త్వరగా పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

పాములు వస్తున్నాయి



ప్రభుత్వ పాఠశాలలోని ఓ గదిలో అంగన్‌వాడీ కేంద్రం నిర్వహిస్తున్నాం. కేంద్రానికి సమీపంలో వన నర్సరీతో పాటు చుట్టూ చెట్లు ఉన్నాయి. చెట్ల పైనుంచి కిటికీలో నుంచి పాములు వస్తున్నాయి. పిల్లలు భయపడుతున్నారు. చాలా భయమేస్తోంది. నీటి సౌకర్యం లేక ఇబ్బంది పడుతున్నాం. సింగరేణి అధికారులు పట్టించుకోవాలి.

– కౌసల్య, అంగన్‌వాడీ టీచర్

అధికారులకు విన్నవించాం



కాలనీలో డ్రైనేజీలు లేవు. సీసీరోడ్లు పాడయ్యాయి. రోడ్ల వెంట చెట్ల పొదలతో పాములు ఇళ్లలోకి వస్తున్నాయి. నరసింహాపురం పునరావాస కాలనీలోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలోకి పాములు వస్తుండంతో పిల్లలను పాఠశాలకు పంపేందుకు తల్లిదండ్రులు భయపడుతున్నారు. ఇటీవల పాములు గదిలోకి వచ్చాయి. కాలనీలో సమస్యలపై పలుమార్లు సింగరేణి అధికారులకు విన్నవించాం. ఎలాంటి స్పందన లేదు.

– పల్లె నారాయణ, కాలనీవాసి

కుంకుమ పూజలు.. నైవేద్యాలు



పెద్దపల్లిరూరల్: కూనారం రోడ్డులో..



సుల్తానాబాద్: పూజల్లో ఎమ్మెల్యే విజయరమణారావు



జూలపల్లి: గణేశ్‌నగర్ వినాయక మండపంలో..



పాలకుర్తి: కురుమపల్లిలో కుంకుమ పూజ



యైటింక్లయిన్‌కాలనీ: అల్లూరు రోడ్-1 గణనాథునికి 108 నైవేద్యాలు



ఓదెల: పూజల్లో ఎస్సై రమేశ్

పెద్దపల్లిరూరల్/ఎలిగేడు/జూలపల్లి/రామగిరి/యైటింక్లయిన్‌కాలనీ/సుల్తానాబాద్/ఓదెల/పాలకుర్తి: వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేసిన గణనాథుల వద్ద బుధవారం కుంకుమ పూజలు, అన్నదానం కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు విఘ్నేశ్వరునికి పలు రకాల నైవేద్యాలు సమర్పించారు.

జీఎం ఆఫీస్ గణనాథునికి 108 రకాల నైవేద్యాలు



నైవేద్యాలు సమర్పిస్తున్న జీఎం లలిత్‌కుమార్

గోదావరిఖని: గణపతి నవరాత్రోత్సవాలను పురస్కరించుకుని బుధవారం ఆర్జీ–1 జీఎం ఆఫీస్‌లోని గణనాథునికి 108రకాల నైవేద్యాలు సమర్పించారు. జీఎం దంపతులు లలిత్‌కుమార్–అనిత దంపతులు ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధికారులు ధనలక్ష్మీబాయి, భీమా, శ్రావణ్‌కుమార్, హనుమంతరావు, సాంబశివరావు, వూట్ల దేవాచారి, ఇందురి సత్యనారాయణ, మురళీధర్, సంతోష్, ఓదెలు తదితరులు పాల్గొన్నారు.

సీహెచ్‌పీ గణపతి వద్ద ప్రత్యేక పూజలు

గోదావరిఖని: గణపతి నవరాత్రోత్సవాలను పురస్కరించుకుని బుధవారం ఆర్జీ–3 ఏరియా ఓసీపీ–1 సీహెచ్‌పీలో జీఎం సుధాకర్‌రావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ప్రాజెక్ట్ ఆఫీసర్ జె.రాజశేఖర్, డీజీఎం కాశీవిశ్వేశ్వరరావు, అధికారులు శ్రీనివాస్, సురేశ్, పిట్ కార్యదర్శి కిషన్‌నాయక్ పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న అధికారికి సన్మానం



సన్మానిస్తున్న జీఎం లలిత్‌కుమార్

గోదావరిఖని: రామగుండం రీజియన్ క్వాలిటీ జీఎంగా విధులు నిర్వహించి నైనీబ్లాక్ జీఎంగా వెళ్తున్న భైద్యాను బుధవారం సన్మానించారు. జీఎం కార్యాలయంలోని చాంబర్‌లో జరిగిన కార్యక్రమంలో బదిలీపై వెళ్తున్న భైద్యాను సన్మానించి జ్ఞాపిక బహూకరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎస్‌వోటూ జీఎం రమేశ్, ఏరియా ఇంజనీరు పి.రమేశ్, అధికారులు చిలక శ్రీనివాస్, ఆంజనేయులు, రమేశ్, సాయిప్రసాద్, రవీందర్‌రెడ్డి, వీరారెడ్డి, బీమా, బ్రహ్మాజీ, లక్ష్మీరాజం, వసంతకుమార్ పాల్గొన్నారు.

సుల్తానాబాద్‌లో గోపూజ

సుల్తానాబాద్: మండల కేంద్రంలోని శివాలయం, పూసాలలో బుధవారం గోపూజ నిర్వహించారు. గాంధీనగర్‌లో మంగళ హారతులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అయ్యప్ప ఆలయంలో..

ధర్మారం: మండల కేంద్రంలోని హరిహరసుత అయ్యప్ప ఆలయంలో బుధవారం గోపూజ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆలయ పూజారి బీవీఎస్ నర్సింగరావు గోపూజ నిర్వహించారు.

సంక్షిప్త వార్తలు

• సేవా పక్వాడ అభియాన్ జిల్లా కన్వీనర్‌గా నల్ల మనోహర్‌రెడ్డి

పెద్దపల్లిరూరల్: ప్రధాని నరేంద్రమోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని దేశవ్యాప్తంగా సేవా పక్వాడ అభియాన్ పేరుతో సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2 దాకా సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ సేవా కార్యక్రమాలను జిల్లావ్యాప్తంగా చేపట్టేందుకు జిల్లా కన్వీనర్‌గా నల్ల మనోహర్‌రెడ్డిని నియమించినట్టు పార్టీ జిల్లా అధ్యక్షుడు కర్రె సంజీవరెడ్డి తెలిపారు. కమిటీ సభ్యులుగా మిట్టపల్లి ప్రవీణ్, కాసగోని నిర్మల, సంజీవ్, భాస్కర్‌రెడ్డిని ఆయన పేర్కొన్నారు.

• సౌకర్యాలు కల్పించండి

కోల్‌సిటీ: రామగుండం నగరపాలక సంస్థ పరిధిలోని ఇందిరమ్మ కాలనీలో కనీస సౌకర్యాలు కల్పించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. బల్దియా కార్యాలయంలో నగరపాలక కమిషనర్ అరుణశ్రీకి బుధవారం వారు వినతిపత్రం సమర్పించారు. అంతర్గత రోడ్లతోపాటు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, తాగునీటి పైప్‌లైన్లు నిర్మించాలని కోరారు. కాలనీ ప్రజల సంతకాలతో కూడిన వినతిపత్రం అందంచారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు గీట్ల లక్ష్మారెడ్డి, ఎన్.భిక్షపతి, తోట రవీందర్, అక్కపాక శంకర్ ఉన్నారు.

• మోడల్ స్కూల్లో స్పాట్ అడ్మిషన్లు

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని మల్యాల మోడల్ స్కూల్లో 2025–26కు గాను 6, 7, 8, 9, 10వ తరగతుల్లో మిగిలిన సీట్లు భర్తీ చేయనున్నట్లు ప్రిన్సిపాల్ అనుముల పోచయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 3 నుంచి 8వ తేదీ వరకు పాఠశాల పనివేళల్లో హాజరు కావాలని సూచించారు. వివరాలకు ప్రిన్సిపాల్ అనుముల పోచయ్య నంబర్ 94414 41042 సంప్రదించాలని పేర్కొన్నారు.

• గణేశ్ మండపాలకు బియ్యం పంపిణీ

కమాన్‌పూర్: మండల కేంద్రంలో నెలకొల్పిన గణేశ్ మండపాలకు మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీనుబాబు ఆదేశాల మేరకు బుధవారం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎస్.ఎస్.అన్వర్ బియ్యం పంపిణీ చేశారు. ఒక్కో మండపానికి 25కిలోల బియ్యం అందజేశారు. మండల కేంద్రానికి చెందిన చీటి వినోద్ ఇటీవల మృతి చెందగా వారి కుటుంబాన్ని పరామర్శించారు.

• ఎంపీడీవోకు వినతి

ఎలిగేడు: గ్రామ పంచాయతీల్లో నిచేస్తున్న పారిశుధ్య, పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు. కార్మికుల వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు ఇరుగురాల లచ్చయ్య మాట్లాడారు. ఎన్నో ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న పంచాయతీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు.

జూలపల్లిలో..

పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో ఎంపీడీవో పద్మజకు వినతిపత్రం అందజేశారు.

• నిమజ్జనం ప్రశాంతంగా జరుపుకోవాలి

ఓదెల: మండలంలో శుక్రవారం జరిగే గణేశ్ నిమజ్జనం ప్రశాంతంగా జరుపుకోవాలని పొత్కపల్లి ఎస్సై దికొండ రమేశ్ అన్నారు. ఓదెల మండల పరిషత్ సమావేశ కార్యాలయంలో బుధవారం కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. డీజేలు వాడొద్దని సూచించారు.

• కేంద్ర కార్మికశాఖ అధికారికి వినతి

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం–తెలంగాణ ప్రాజెక్టులో కాంట్రాక్టు కార్మికులకు ఎన్నికలు నిర్వహించాలని కేంద్ర కార్మిక శాఖ డిప్యూటీ లేబర్ కమిషనర్‌కు వినతిపత్రం అందించారు. కాంట్రాక్టు లేబర్ యూనియన్ (బీఎంఎస్) అధ్యక్షుడు బండారి కనకయ్య హైదరాబాద్‌లోని కేంద్ర కార్మికశాఖ కార్యాలయ అధికారికి బుధవారం వినతిపత్రం అందించినట్లు ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్టీపీసీ రామగుండం–తెలంగాణ ప్రాజెక్టులో సుమారు 6వేల మందికి పైగా కాంట్రాక్టు కార్మికులు విధులు నిర్వహిస్తున్నారన్నారు.

• సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా

రామగుండం: గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని అంతర్గాం ఎంపీడీవో కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం ధర్నా నిర్వహించారు. పెండింగ్ వేతనాలు చెల్లించాలని, మల్టీపర్పస్ వర్కర్స్ విధానం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం వినతిపత్రం అందించారు. సీఐటీయూ మండల కన్వీనర్ నర్సింగరావు, పోచం, సురేశ్ పాల్గొన్నారు.

• జూలపల్లిలో కళాఉత్సవం–2025

జూలపల్లి: మండల కేంద్రంలోని విద్యావనరుల కేంద్రంలో కళాఉత్సవం–2025 నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ పాఠశాలల నుంచి పాల్గొన్న విద్యార్థులు నృత్యాలతో పాటు పలు విభాగాల్లో ప్రదర్శనలు నిర్వహించారు. విజేతలు జిల్లాస్థాయిలో పాల్గొంటారని ఎంఈవో సరస్వతి పేర్కొన్నారు.

• ఎలిగేడులో సాంస్కృతిక పోటీలు

ఎలిగేడు: మండల కేంద్రంలోని విద్యావనరుల కేంద్రంలో బుధవారం కళోత్సవం–2025 నిర్వహించారు. ఈ సందర్భంగా పలు పాఠశాలల విద్యార్థులు వివిధ కళలను ప్రదర్శించారు. కార్యక్రమంలో ఎంఈవో నరేంద్రచారి, హెచ్‌ఎం దేవేందర్‌రావు, రాజమణి, రమాదేవి, సీఆర్‌పీ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో నలుగురు మాజీ సర్పంచుల చేరిక



బీజేపీలో చేరిన మాజీ సర్పంచులు

ఓదెల: మండలంలోని ఉప్పరపల్లె, లంబాడితండా, ఇందుర్తి, గుంపుల గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ మాజీ సర్పంచులు పల్లె ఓదెలు, గుగులోతు లక్ష్మి వస్తునాయక్, అంబాల సంధ్యారాణి శ్రీనివాస్, తిప్పారపు చిరంజీవి బీజేపీలో చేరారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు కర్రె సంజీవరెడ్డి, నాయకులు నల్ల మనోహర్‌రెడ్డి సమక్షంలో కరీంనగర్‌లో కరీంనగర్ ఎంపీ, కేంద్రమంత్రి బండి సంజయ్ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి బీజేపీలో చేరారు. మండలంలోని బీఆర్ఎస్‌కు చెందిన నలుగురు మాజీ సర్పంచులు బీజేపీలో చేరడంతో పార్టీ శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. కొలనూర్ మాజీ సర్పంచు మాటూరి వెంకటస్వామి, పలువురు ఉన్నారు.



రామగుండం: పట్టణంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ ప్రాంగణంలో మూత్రశాలలు, మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టాల్సి ఉన్నా ఏడాదైనా ఆ దిశగా చర్యలు చేపట్టకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రిజిస్ట్రేషన్ల నిమిత్తం నియోజకవర్గ పరిధిలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రతీరోజు వందలాది మంది వస్తుంటారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయ్యే వరకు కనీసం 4, 5 గంటలు వేచి ఉండాల్సిందే. మూత్రశాలలు, మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టకపోవడంతో పురుషులు, మహిళలు అత్యవసరాలకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ప్రజల కనీస సౌకర్యాల కల్పనపై పాలకులు దృష్టిసారించాలని పలువురు కోరుతున్నారు.

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 97053 46608, 98499 71500

ఈపీ ఆపరేటర్లకు సీగ్రేడ్ ఇప్పించండి



మాట్లాడుతున్న ఈపీ ఆపరేటర్లు

యైటింక్లయిన్‌కాలనీ: సింగరేణి రామగుండం రీజియన్–1, 2, 3 ఏరియాలోలో 2017లో నియమితులైన ఈపీ ఆపరేటర్లకు రూల్స్ ప్రకారం 2021 సెప్టెంబర్ నుంచి అమలయ్యేలా సీగ్రేడ్ ప్రమోషన్లు ఇవ్వాలని ఆర్జీ–1, 2, 3 ఏరియా ఈపీ ఆపరేటర్ల సీగ్రేడ్ సాధన సమితి ప్రతినిధులు డిమాండ్ చేశారు. యైటింక్లయిన్‌కాలనీ ప్రెస్‌భవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. సింగరేణిలోని మిగతా ఏరియాల్లోని ఈపీ ఆపరేటర్లకు సీగ్రేడ్ అమలు చేస్తున్న యాజమాన్యం, ఆర్జీ–1, 2, 3 ఏరియాల్లో విధులు నిర్వహిస్తున్న డీగ్రేడ్ ఈపీ ఆపరేటర్లకు మాత్రం ఆరేళ్ల నుంచి ప్రమోషన్లు ఇవ్వకపోవడంపై మండిపడ్డారు. ప్రస్తుతం గుర్తింపు సంఘం ఏఐటీయూసీ 25రోజుల్లో ప్రమోషన్లు ఇప్పిస్తామని చెప్పడం సంతోషకరమైనా, 2021 సెప్టెంబర్ నుంచి ప్రమోషన్లు అమలయ్యేలా ఇప్పించాలని కోరారు. సింగరేణి యజమాన్యం స్పందించి వెంటనే సీగ్రేడ్ ప్రమోషనులఇవ్వాలని కోరారు. లేనియెడల ఆమరణ దీక్ష చేపట్టడంతో పాటు న్యాయ పోరాటం చేస్తామని పేర్కొన్నారు. ఈపీ ఆపరేటర్ల సీగ్రేడ్ సాధన సమితి ప్రతినిధులు సాలిగామ మల్లేశ్, సత్యనారాయణ, క్రాంతి, తిరుపతి, కిరణ్‌కుమార్, రవి, రాజిరెడ్డి, సాగర్, రాజశేఖర్, విజయ్‌కుమార్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

'దుద్దిళ్ల కుటుంబంపై బురదజల్లే ప్రయత్నం'

ముత్తారం: దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన లాయర్ దంపతుల హత్య కేసును సీబీఐకి అప్పగించడంతో పుట్ట మధుకు మతిభ్రమించిందని కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు చొప్పరి సదానందం అన్నారు. మండలంలోని కేశనపల్లిలో కమాన్‌పూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మద్దెల రాజయ్యతో కలిసి బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దుద్దిళ్ల కుటుంబంపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారన్నారు. మరోసారి దుద్దిళ్ల కుటుంబంపై ఇష్టం వచ్చినట్లుగా ఆరోపణలు చేస్తే ఊరుకునేది లేదన్నారు. కమాన్‌పూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు బొల్లినేని బుచ్చంరావు, జాగిరి సమ్మయ్య, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బక్కతట్ల వినీత్, బీసీ సెల్ మండల అధ్యక్షుడు అల్లం కుమారస్వామి, కిసాన్‌సెల్ మండల అధ్యక్షుడు గాదం శ్రీనివాస్, మాజీ సర్పంచులు మేడగోని సతీశ్, వకులారాణి శంకర్, మాజీ ఎంపీటీసీ మల్యాల రాజయ్య, కాంగ్రెస్ నాయకులు మోహన్‌రెడ్డి, పెగడ కుమార్, తాళ్లపల్లి కుమార్, రాపల్లి రాజయ్య, చంద్రమౌళి పాల్గొన్నారు.

సింగరేణి అధికారుల నిర్లక్ష్యంతో గీత కార్మికులకు నష్టం

రామగిరి: మండలంలోని లద్నాపూర్ ఎల్లమ్మ ఆలయం వద్ద ఆర్జీ–3 అధికారుల నిర్లక్ష్యంతో గీత కార్మికులు నష్టాల పాలవుతున్నారని కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి తోట చంద్రయ్య, ఆరెల్లి కొమురయ్య గౌడ్, యూత్ కాంగ్రెస్ డివిజన్ మాజీ అధ్యక్షుడు బర్ల శ్రీనివాస్ ఆరోపించారు. లద్నాపూర్ ఎల్లమ్మ ఆలయం వద్ద చుట్టూ చేరిన నీటిని బుధవారం వారు పరిశీలించి మాట్లాడారు. సింగరేణి అధికారుల నిర్లక్ష్యంతో ఎస్సారెస్పీ కాలువ ద్వారా వచ్చే నీరు బొక్కల వాగులో కలిసేదని, నీటికి అడ్డుకట్ట వేయడం ద్వారా చుట్టుపక్కల గ్రామాల పంటపొలాల్లోకి నీరు వస్తోందన్నారు. మిషన్ భగీరథ పైపులైన్‌లో నీరు కలుస్తోందని, శ్మశాన వాటిక వద్ద కలవడంతో కలుషితం అవుతోందని వాపోయారు. సింగరేణి అధికారులు స్పందించి నీరు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

కాంట్రాక్టు కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న ఉడుత శంకర్

రామగిరి: సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సమస్యల పరిష్కారానికి ఐఎన్‌టీయూసీ ఎల్లప్పుడూ ముందుంటుందని కాంట్రాక్టు కార్మిక సంఘం ఆర్జీ–3 ఏరియా ఉపాధ్యక్షుడు ఉడుత శంకర్ అన్నారు. మండలంలోని సెంటినరికాలనీ శ్రీపాదభవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంట్రాక్టు కార్మికులను కొన్ని యూనియన్‌లు తప్పుదోవ పట్టిస్తున్నాయని, వారి మాట నమ్మి మోసపోవద్దన్నారు. మినిమమ్ వేజ్ బోర్డు చైర్మన్ జనక్ ప్రసాద్ నాయకత్వంలో కాంట్రాక్టు కార్మికుల హక్కుల సాధనకు కృషి చేస్తున్నామని పేర్కొననారు. కాంట్రాక్టు కార్మికులకు లాభాల వాటా రూ.5వేలు ఇప్పించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనన్నారు. నాయకులు శ్రీమతిరెడ్డి, జాగరి రజిత, కిరణ్‌రెడ్డి, శ్రీకాంత్ పాల్గొన్నారు.

మహా ప్రసాద వితరణ కార్యక్రమం

రామగిరి: రామగుండం–3, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియాలోని సెక్యూరిటీ కార్యాలయంలో గల త్రయంబకేశ్వరాలయంలోని మహాగణపతి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా బుధవారం మహా ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఆర్జీ–3 జీఎం నరేంద్ర సుధాకరరావు, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొలిపాక నాగేశ్వరరావు పాల్గొని వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏరియా సెక్యూరిటీ ఆఫీసర్ అబ్దుల్ షబ్బీరుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

పత్తి దిగుమతి సుంకం తగ్గింపు జీవో ఉపసంహరించుకోవాలి

రామగుండం: కేంద్ర, రాష్ట్ర కమిటీల పిలుపులో భాగంగా జిల్లా కమిటీ ఆధ్వర్యంలో అంతర్గాం మండల తహసీల్దార్‌కు సంయుక్త కిసాన్‌మోర్చా ఆధ్వర్యంలో బుధవారం వినతిపత్రం అందించారు. జిల్లా నాయకులు ఎల్.భీమయ్య, మేరుగు చంద్రయ్య, గుమ్మడి వెంకన్న, నర్సింగరావు మాట్లాడారు. పత్తి పంటకు కనీస మద్దతు ధర క్వింటాల్‌కు రూ.10,075 నిర్ణయించాలని కోరారు. భారీ వర్షాలకు దెబ్బతిన్న అన్నిరకాల పంటలకు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ(ఎం–ఎల్) న్యూడెమోక్రసీ మండల కార్యదర్శి కొల్లూరి మల్లేశ్, మాస్‌లైన్(ప్రజాపంథా)జిల్లా, మండల నాయకులు శంకర్, తేజస్వర్, తిరుపతి, దేవయ్య, ఓదెలు, రైతులు రాజయ్య పాల్గొన్నారు.